సాక్షి ఖమ్మం

శుక్రవారం : 30 : జూన్ : 2023



పాఠాలు చెప్పేదెవరు?

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత వేధిస్తున్నా ప్రత్యామ్నాయాలపై అధికారులు దృష్టి సారించడం లేదు. 8లో



వర్షం ఆధారంగానే పత్తి సాగు

కనీస వర్షపాతం నమోదు కాకుండానే పత్తి విత్తనాలు నాటితే ఫలితం ఉండదని శాస్త్రవేత్తలు రైతులకు సూచిస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం 36° / 27°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. రోజంతా ఉక్కపోత వాతావరణమే ఉంటుంది.

న్యూస్‌రీల్

గ్రూప్-4 అభ్యర్థులకు ప్రత్యేక బస్సులు

ఖమ్మం మామిళ్లగూడెం/సత్తుపల్లి టౌన్: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యాన శనివారం జరగనున్న గ్రూప్-4 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసినట్లు ఖమ్మం, సత్తుపల్లి డిపో మేనేజర్లు శ్రీనివాస్, యు.రాజ్యలక్ష్మి తెలిపారు. ఖమ్మం డిపో ద్వారా వరంగల్ క్రాస్ రోడ్ నుంచి మమత కళాశాల, వరంగల్ క్రాస్ రోడ్డు నుండి శ్రీశ్రీ సర్కిల్, సిటీ బస్టాండ్ నుండి కొత్త బస్టాండ్ వయా ఎన్ఎస్టీ రోడ్డు వరకు, సిటీ బస్టాండ్ నుండి తనికెళ్ల, దానవాయిగూడెం, మల్లెమడుగుకు బస్సులు నడుపుతామని తెలిపారు. అలాగే, సత్తుపల్లి నుంచి ఖమ్మంకు, ఖమ్మం నుంచి సత్తుపల్లికి ప్రత్యేక బస్సులు నడుస్తాయని పేర్కొన్నారు. ఇవేకాక అన్ని రూట్లలో తిరిగే షెడ్యూల్ బస్సులను కూడా చేయి ఎత్తిన చోట ఆపి కోరిన చోట దించుతారని తెలిపారు. కాగా, అభ్యర్థులకు సమాచారం ఇచ్చేందుకు బస్టాండ్లలో హెల్ప్ లైన్ సెంటర్లు కూడా ఏర్పాటుచేస్తున్నామని డీఎంలు వెల్లడించారు.

శ్రీవారికి రూ.3లక్షల విలువైన వెండి పాదపద్మం



శ్రీవారికి వెండి ఆభరణం సమర్పిస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో గురువారం తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి, అమ్మ వార్లకు అర్చకులు పంచామృతాలతో అభిషేకం చేశారు. అలాగే, ఆలయ ప్రాంగణంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీలోని విజయవాడకు చెందిన భక్తుడు దుర్గాభవం శ్రీవారికి రూ.3.31లక్షల విలువైన 3.649 కేజీల వెండి పాదపద్మాన్ని సమర్పించాడు. ఈమేరకు ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తికి ఆభరణం అందజేయగా, అర్చకులు సంప్రోక్షణ అనంతరం శ్రీవారికి అలంకరించారు. సర్పంచ్ ముల్పూరి స్వప్న, ఎర్రుపాలెం సొసైటీ చైర్మన్ ముల్పూరి శ్రీనివాసరావు, ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ముఖ్య అర్చకులు ఉప్పల మురళీమోహన్‌శర్మ, అర్చకులు రాజీవ్ శర్మ, ఉద్యోగులు బుర్రి శ్రీనివాస్, కె.విజయ్‌కుమారి పాల్గొన్నారు.

నేడు ఖమ్మంకు రేవంత్‌రెడ్డి

- ముఖ్యనేతలతో భేటీ, జనగర్జన సభాస్థలి పరిశీలన



ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం సహకారనగర్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి శుక్రవారం ఖమ్మం రానున్నారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరనుండడం, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర ముగింపు సందర్భంగా వచ్చేనెల 2న ఖమ్మంలో తెలంగాణ జనగర్జన సభ ఏర్పాటుచేస్తున్నారు. ఈ సభకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతోపాటు జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరుకానున్నందున సభ ఏర్పాట్ల పరిశీలనకు రేవంత్ వస్తున్నారు. ఉదయం 11గంటలకు ఆయన కాంగ్రెస్ కార్యాలయంలో ముఖ్యనేతలతో సమావేశమవుతారు. ఆతర్వాత మాజీ ఎంపీ పొంగులేటితో కలిసి సభ ఏర్పాట్లను పరిశీలించనున్నారు.

ఖిలా వరంగల్‌లో కలెక్టర్ గౌతమ్



శిల్పకళా సంపద వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమ్

ఖిలా వరంగల్: కాకతీయుల రాజధాని, ఖిలా వరంగల్‌ను ఖమ్మం కలెక్టర్ గౌతమ్ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యకోటలోని కాకతీయుల కీర్తి తోరణాల నడుమ ఉన్న శిల్ప సంపదతో పాటు ఖుష్‌మహల్, రాతి, మట్టికోట అందాలు, ఏకశిల గుట్ట, శృంగారపు బావిని తిలకించారు. కాకతీయుల చరిత్ర, విశిష్టతలను పర్యాటక శాఖ గైడ్ రవియాదవ్ కలెక్టర్‌కు వివరించారు. కేంద్ర పురావస్తుశాఖ సిబ్బంది, టీఎస్‌టీడీసీ ఇన్‌చార్జ్ గట్టికొప్పుల అజయ్ తదితరులు పాల్గొన్నారు.



గొల్లగూడెం ఈద్గాలో ప్రార్థనకు హాజరైన ముస్లింలు, నమాజ్ చేస్తున్న చిన్నారి

భక్తిశ్రద్ధలతో బక్రీద్

జిల్లావ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని, గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే ఈద్గాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు బక్రీద్ ప్రత్యేకతలు, అల్లా సందేశాన్ని వినిపించారు. ఆతర్వాత పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకోగా.. పలువురు ప్రజాప్రతినిధులు కూడా ప్రార్థనల్లో పాల్గొన్నారు.

- ఫొటోలు 9లో..

ఘనంగా తొలి ఏకాదశి



ఖమ్మం నర్సింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

హిందువులు పవిత్రంగా భావించే తొలి ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈమేరకు భక్తులు బారులు దీరి దర్శించుకున్నారు.

- ఫొటోలు 9లో..

పోడుకు పట్టాభిషేకం!



నేటి నుంచి హక్కు పత్రాల జారీ

- హాజరుకానున్న మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ
- జిల్లాలో 6,589 మందికి 13,139.03 ఎకరాలపై హక్కు

ఖమ్మంమయూరిసెంటర్: దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పోడు రైతుల సమస్యకు పరిష్కారం లభించింది. పోడుదారులకు పట్టాల పంపిణీ ప్రక్రియ తుది అంకానికి చేరింది. అర్హులైన పోడుదారులకు హక్కు పత్రాల జారీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా.. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం లాంఛనంగా పట్టాలు పంపిణీ మొదలవుతుంది. ఖమ్మంతో పాటు కొత్తగూడెంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ లబ్ధిదారులకు పట్టాలు అందజేయనున్నారు. ఈకార్యక్రమాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారు.

దరఖాస్తులు.. సర్వే

గతంలో జరిగిన ఉద్యమాలతో అర్హులైన పోడుదారులకు పట్టాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2021 నవంబర్ 8 నుంచి దరఖాస్తులు స్వీకరించగా, షెడ్యూల్ తెగల వారు 25,515 ఎకరాలపై హక్కు కోసం 9,507 దరఖాస్తులు, ఇతరులు 17,678 ఎకరాల కోసం 8,980 దరఖాస్తులు అందజేశారు. మొత్తంగా 18,487 దరఖాస్తులు 43,193 ఎకరాల్లో హక్కు కోసం అందగా ప్రభుత్వం నియమించిన బృందం సర్వే చేపట్టింది. ఆతర్వాత గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు చేశారు. షెడ్యూల్ తెగలకు సంబంధించి 13,560 ఎకరాలపై 6,795 దరఖాస్తులు, ఇతరులకు 2,074.23 ఎకరాలపై హక్కు కల్పించేలా 2,588 దరఖాస్తులను ఆమోదించారు. ఇందులో ఖమ్మం డివిజన్ పరిధిలో 3,249 దరఖాస్తులకు గాను 4,232.15 ఎకరాలకు, కల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 694 దరఖాస్తులకు సంబంధించి 693.48 ఎకరాలకు డివిజన్ స్థాయి కమిటీలు సిఫారసు చేశాయి.

మండలాల వారీగా పోడు హక్కు పట్టాల పంపిణీ వివరాలు

మండలం	లబ్ధిదారులు	ఎకరాలు
సింగరేణి	2,101	5,070.27
కొణిజర్ల	1,287	1,908.02
రఘునాథపాలెం	694	1,707.12
సత్తుపల్లి	1,196	1,651.03
పెనుబల్లి	801	1,437.23
ఏన్కూరు	269	709.25
కామేపల్లి	239	6,53.00
తల్లాడ	01	1.16
వేంసూరు	01	0.15

పట్టాలు, పాస్‌బుక్‌లు

జిల్లాలో ఖమ్మం, సత్తుపల్లి, వైరా, ఇల్లెందు నియోజకవర్గాల పరిధిలో తొమ్మిది మండలాల నుండి పోడు హక్కు పత్రాల కోసం లబ్ధిదారుల దరఖాస్తు చేసుకోగా అర్హులను ఎంపిక చేశారు. ఆయా మండలాల్లో 77 గ్రామ పంచాయతీల్లోని 106 ఆవాసాల్లో లబ్ధిదారులకు పట్టాలు అందజేయనున్నారు. మొత్తంగా 6,589 మందికి 13,139.03 ఎకరాలపై పోడు హక్కు కల్పిస్తూ పట్టాలు, పాస్ బుక్‌లు అందజేస్తారు. ఆయా రైతులకు ఈ సీజన్ నుంచే పెట్టుబడి సాయం కూడా అందిస్తామని రాష్ట్రప్రభుత్వం ప్రకటించడంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పోడు సాగుదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

పాలేరు ప్రజలు పోరాటయోధులు



పాదయాత్రగా వస్తున్న భట్టి విక్రమార్క, పక్కన నాయకులు

- మీ ఓట్లు అమ్ముకున్న ఎమ్మెల్యేకు బుద్ధి చెప్పండి
- జనగర్జన సభతో సత్తా చాటాలి
- పీపుల్స్‌మార్చ్ యాత్రలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



చిరువ్యాపారుల సమస్యలు తెలుసుకుంటూ...

కూసుమంచి: పాలేరు నియోజకవర్గ ప్రజలు పోరాటయోధులే కాక త్యాగాలు చేశారని, ప్రజా సమస్యలపై కొట్లాడి నిలబడ్డారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా గురువారం కూసుమంచి, జీళ్లచెరువుల్లో నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడారు. ఈ నియోజకవర్గం గెలిచి మంత్రులుగా బాధ్యతలు నిర్వర్తించిన సంభాని చంద్రశేఖర్, రాంరెడ్డి వెంకటరెడ్డి, కత్తుల శాంతయ్య, పొట్టపింజరు హుస్సేన య్య తదితరులు ప్రజలను నమ్ముకున్నారు తప్ప వాళ్ల ఓట్లను అమ్ముకోలేదని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డిని కాంగ్రెస్ నుంచి గెలిపిస్తే వేల కోట్ల కాంట్రాక్టుల కోసం అమ్ముకుని పాలేరు ప్రజలు తలదించుకునేలా చేశాడని విమర్శించారు.

నాలుగు నెలలు ఆగండి...

ప్రస్తుత ఎమ్మెల్యే పాలేరు చరిత్రలో ద్రోహిగా మిగలడమే కాక పోలీసులను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ నాయకులపై కేసులు పెట్టిస్తున్నాడని భట్టి ఆరోపించారు. కాంగ్రెస్ కార్యకర్తల వెనుక ఎవరూ లేరని అనుకుంటున్నారని.. నాలుగు నెలలు ఆగితే వచ్చే తమ రాజ్యంలో ఎమ్మెల్యే, ఆయన పార్టీని బంగాళాఖాతంలో కలుపుతామని హెచ్చరించారు. అధికార పార్టీకి దాసోహంగా మారిన ఇక్కడి ఏసీపీ ఎక్కడి నుండి వచ్చారో, ఆయన వెనుక ఎవరు ఉన్నారో తెలుసునని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, 2వ తేదీన తన పాదయాత్ర ముగింపు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేరిక సందర్భంగా నిర్వహించే తెలంగాణ జనగర్జన సభకు రాహుల్‌గాంధీ హాజరవుతున్నారని భట్టి తెలిపారు. ఈసభకు ప్రజలు భారీగా తరలిరావాలని కోరారు. పాదయాత్రలో మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, జెడ్పీ మాజీ చైర్మన్ చందా లింగయ్య, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు రాయల నాగేశ్వరరావు, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, మట్టి గురవయ్య, కళ్లెం వెంకటరెడ్డి, హఫీజ్, రాంరెడ్డి, వినోద, నాగరాజు, అంజని తదితరులు పాల్గొన్నారు. కాగా, రెండో రోజు యాత్ర పాలేరు నుండి మొదలై కూసుమంచి, కేశ్వాపురం, జీళ్లచెరువు, గోపాలరావుపేట మీదుగా ఖమ్మంరూరల్ మండలంలోని తల్లంపాడుకు చేరింది. యాత్ర పొడవునా రైతులు, ప్రయాణికులు, చిరు వ్యాపారులను పలకరించిన భట్టి వారి సమస్యలు తెలుసుకుని భరోసా కల్పించారు. ఇక పాదయాత్రలో వెన్నంటి నడిచిన నల్లగొండ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పాశం నరేష్‌రెడ్డిని సన్మానించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి, ఓయూ జేఏసీ అధ్యక్షుడు లోకేష్‌యాదవ్‌తో పాటు నాయకుడు డాక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు గ్రూప్-4 పరీక్ష

- జిల్లాలో 163 కేంద్రాలు
- హాజరుకానున్న 49,781మంది అభ్యర్థులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్పీఎస్సీ) ఆధ్వర్యాన శనివారం జరగనున్న గ్రూప్-4 పరీక్షకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలో 163 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 49,781మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఉదయం 10నుండి 12-30 గంటల వరకు, మధ్యాహ్నం 2-30నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఉదయం పరీక్షకు 8నుండి 9-45గంటల వరకు, మధ్యాహ్నం పరీక్షకు ఒంటి గంట నుంచి 2-15వరకు అనుమతించనున్నారు. ఆతర్వాత వస్తే అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు.

ఏర్పాట్లు పూర్తిచేశాం..

గ్రూప్-4 పరీక్ష నిమిత్తం ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌పై ఫొటో, సంతకం చూసుకోవాలని, ఫొటో సరిగ్గా లేకపోతే గెజిటెడ్ అధికారి ధృవీకరించిన మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు ఓఎంఆర్ షీట్‌పై సూచనలను క్షుణ్ణంగా చదవాలని, బబ్లింగ్‌లో పొరపాట్లు చేయొద్దని, హాల్‌టికెట్ నంబర్, ప్రశ్నాపత్రం నంబర్ సరిగ్గా నమోదు చేయాలని తెలిపారు. ఓఎంఆర్ షీట్‌పై వైటనర్‌తో చెరిపినా, ఇతరత్రా పొరపాట్లు చేసినా ఆ షీట్‌ను పరిగణనలోకి తీసుకోరని స్పష్టం చేశారు. కాగా, పరీక్ష ముగిశాక అభ్యర్థులు ఓఎంఆర్ షీట్ అప్పగించి ఎడమచేతి బొటనవేలు ముద్ర ఇవ్వాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

అభ్యర్థులకు సూచనలు

అభ్యర్థులు నిర్ణీత సమయాని కంటే ముందుగానే కేంద్రాలకు చేరుకుంటే మంచిది. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు తీసుకురావొద్దు. ఒరిజినల్ హాల్‌టికెట్‌తో పాటు ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు (ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్ లేదా ఏదైనా ఫొటో గుర్తింపు కార్డు) తప్పక తీసుకురావాలి. ప్రతీ అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేశాకే కేంద్రాల్లోకి అనుమతిస్తారు.

పలువురు ఎస్సైల అటాచ్‌మెంట్

ఖమ్మంక్రైం: జిల్లాలో పలువురు ఎస్సైలను వివిధ స్టేషన్లకు అటాచ్‌మెంట్ చేస్తూ పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. సత్తుపల్లి ఎస్ఐ బి.రామును ఖమ్మం త్రీటౌన్‌కు, ఖమ్మం త్రీటౌన్(ప్రస్తుతం ఖమ్మం అర్బన్) ఎస్ఐ డి.శ్రావణ్‌కుమార్‌ను సత్తుపల్లికి కేటాయించారు. అలాగే, ఖమ్మం టూటౌన్ ఎస్ఐ వీరప్రసాద్ వేంసూరుకు, అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సురేష్‌ను ఖమ్మం టూటౌన్‌కు, వీఆర్‌లో ఉన్న స్వప్నను ఖమ్మం అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు అటాచ్‌మెంట్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆకు.. వెనుకకు !

- ఏటా లక్ష్యానికి దూరంగానే తునికాకు సేకరణ
- రెండు, మూడుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్ల నిరాసక్తత
- ఆపై ఆకు అందుబాటులో లేక ఇతర పనులకు గిరిజనులు
- బీడీల అమ్మకం పడిపోవడమూ ఓ కారణమే!

సాక్షి, ఖమ్మం డెస్క్: వేసవిలో వ్యవసాయ పనులు లేక ఇక్కట్లు ఎదుర్కొనే గిరిజనులు, కూలీలను ఏటా తునికాకు సేకరణ ఆదుకునేది. దీంతో గిరిజనులు తునికాకు సేకరణను రెండో పంటగా భావించారు. కానీ ఇదంతా గతం! ఎందుకంటారా? పోడు సాగు పెరగడంతో తునికాకు చెట్లు తగ్గిపోవడం.. బీడీలు తయారుచేసే వారి సంఖ్య తగ్గడం, ఉపాధి హామీ పథకం అందుబాటులోకి రావడం వంటి కారణాలతో తునికాకు సేకరణపై అటు కాంట్రాక్టర్లు, ఇటు గిరిజనులు ఆసక్తి చూపక అటవీ శాఖ లక్ష్యం నెరవేరడం లేదు.

ఇల్లు కట్టి.. పెళ్లి చేసి...

వేసవి వస్తుందంటే అభయారణ్యం సమీప ప్రాంతాల్లో తునికాకు సేకరణ మొదలయ్యేది. కుటుంబమంతా ఉదయాన్నే అడవికి వెళ్లి ఆకు తీసుకొచ్చి కట్టలుగా కట్టి కల్లాల్లో అప్పగించేవారు. కుటుంబంలో ఐదారుగురు ఉంటే రోజుకు 500 పైగానే కట్టలు కట్టేవారు. ప్రస్తుతం కట్టకు రూ.3 వస్తుండగా ఒక్కో కుటుంబానికి రోజుకు రూ.1,500 నుంచి రూ.2వేల వరకు.. నెలకు రూ.50 వేల ఆదాయం సమకూరేది. దీంతో ఇల్లు కట్టుకోవడం, పిల్లల పెళ్లి చేసేందుకు ఉపయోగించుకునేవారు. కానీ ఇప్పుడు ఆ స్థాయిలో ఆకు లభ్యత లేదు. ప్రధానంగా పోడు వ్యవసాయంతో తునికాకు చెట్లు అంతరించిపోవడమే కారణంగా చెబుతున్నారు.

ఛత్తీస్‌గఢ్ వైపే కాంట్రాక్టర్ల మొగ్గు

ఛత్తీస్‌గఢ్‌తో పాటు మహారాష్ట్ర అటవీ ప్రాంతాల్లో తునికాకు ఎక్కువగా లభిస్తోంది. గతంలో తెలంగాణలోనూ అదే పరిస్థితి ఉన్నా రానురాను చెట్లు అంతరించిపోవడంతో అటవీ అధికారులు టెండర్లు ఆహ్వానిస్తే కాంట్రాక్టర్లు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర యూనిట్లు పూర్తయ్యాకే తెలంగాణ వైపు వస్తున్నారు. దీంతో ఏటా రెండు, మూడు సార్లు టెండర్లు ఆహ్వానించినా పూర్తి స్థాయిలో యూనిట్లు అమ్ముడవడం లేదు.

సేకరణ అంతంతే...

ఈ ఏడాది రాష్ట్రంలోని ఎనిమిది సర్కిళ్లలో పరిశీలిస్తే 2,27,800 స్టాండర్డ్ బ్యాగుల (ఒక్కో స్టాండర్డ్ బ్యాగులో 1000 తునికాకు కట్టలు, ఒక్కో కట్టలో 50 ఆకులు ఉంటాయి) తునికాకు సేకరించాలనేది లక్ష్యం. కానీ 60 శాతానికి మించలేదని అధికారిక సమాచారం. భద్రాద్రి జిల్లాలోని అటవీ డివిజన్లలో కలిపి 35,100 స్టాండర్డ్ బ్యాగుల ఆకు సేకరించాలనేది లక్ష్యం కాగా, 21వేల బ్యాగుల సేకరణే జరిగింది. మిగతా జిల్లాలు, సర్కిళ్లలోనూ ఇదే పరిస్థితి నెలకొనగా.. గత కొన్నేళ్లుగా అలాగే సాగుతోంది.

దూరం వెళ్లాల్సి వస్తోంది..



గతంలో మాదిరి తునికాకు దొరకడం లేదు. అప్పట్లో అడవిలో కాస్త దూరం వెళ్లగానే ఆకు కనిపించేది. ఇప్పుడు అడవి లోపలకు వెళ్లినా చెట్లు ఉండడం లేదు. రోజంతా కుటుంబం మొత్తం కష్టపడితే 100 కట్టలకు సరిపడా ఆకు దొరకడమే కష్టమవుతోంది. అందుకే ఎవరూ ఈ పనికి రావట్లేదు.

–మొక్కటి సుగుణ, రేగులగూడెం, పాల్వంచ మండలం

అకాల వర్షాలతో ఆలస్యం



మార్చి, ఏప్రిల్‌లో అకాల వర్షాలతో తునికాకు సేకరణ ఈ ఏడాది ఆలస్యమైంది. దీనికి తోడు ఆకు సేకరణ కూడా రకరకాల కారణాలతో తగ్గుతోంది. ఇందుకు పోడు సాగు ప్రధానమని చెప్పాలి. ఇక గిరిజనులు కూడా ఇతర పనులకు వెళ్తుండడంతో సేకరణపై ప్రభావం చూపిస్తోంది.

– కట్ట దామోదర్‌రెడ్డి, వైల్డ్ లైఫ్ ఎఫ్‌డీఓ, పాల్వంచ



ఇంట్లో తునికాకులను కట్టలుగా కడుతున్న కుటుంబం



రూపాయికే సిగరెట్!

తునికాకును ప్రధానంగా బీడీల తయారీకే ఉపయోగిస్తుండగా.. బీడీల వాడకం తగ్గడం.. తయారు చేసే మహిళలు ఇతర పనుల్లో నిమగ్నం కావడంతో ఆ పరిశ్రమ కూడా అంతగా లాభాల్లో లేదు. వరంగల్ తదితర జిల్లాల్లో పరిశీలిస్తే పదుల సంఖ్యలో బీడీ పరిశ్రమలు ఉండేవి. అక్కడి వేలాది మంది మహిళలు బీడీల తయారీలో నిమగ్నమయ్యే వారు. కానీ మహిళా సంఘాలకు రుణాలు వస్తుండడం, బీడీ తయారీలో ఉపయోగించే పొగాకు కారణంగా అనారోగ్యం దరి చేరుతుండడంతో ఇతర పనుల్లోకి మళ్లారు. దీంతో ఒక్కో పరిశ్రమ నుంచి రోజుకు లారీ లోడ్ వెళ్లే బీడీలు ఇప్పుడు నెలకో లోడ్ కూడా వెళ్లే పరిస్థితి లేదు. ఒక కట్టలో 20 నుంచి 25 బీడీలు ఉంటుండగా.. దీని ధర రూ.20 పలుకుతోంది. కానీ రూ.1కే సిగరెట్ కూడా లభిస్తుండడంతో బీడీలు తాగేవారు ఇటు వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా బీడీల అమ్మకాలు పడిపోయి పరిశ్రమల నిర్వాహకులు నిరాసక్తత కనబరుస్తున్నారు.

క్లుప్తంగా

నేడు మంత్రులు పువ్వాడ, హరీశ్‌రావు పర్యటన

భద్రాద్రి, ఖమ్మంలో పోడుపట్టాల పంపిణీ

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఉదయం ఖమ్మం 55వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత 10.30 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం పాల్వంచకు వెళ్లి మంత్రి హరీశ్‌రావుతో కలిసి లబ్ధిదారులకు పోడు పట్టాలు పంపిణీ చేస్తారు. అనంతరం మంత్రులు హెలీకాప్టర్‌లో మధ్యాహ్నం 2.45 గంటలకు ఖమ్మం చేరుకుని జెడ్పీసెంటర్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆస్పత్రుని సందర్శిస్తారు. అక్కడి నుంచి భక్తరామదాసు కళాక్షేత్రానికి వచ్చి జిల్లాలోని లబ్ధిదారులకు పోడు హక్కు పట్టాలు పంపిణీ చేయనున్నారు.

న్యూ టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీ సభ్యత్వాలు



సమావేశంలో మాట్లాడుతున్న అఫ్జల్‌హసన్

ఖమ్మం సహకారనగర్: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని టీఎన్జీవోస్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ది న్యూ టీఎన్జీఓస్ హౌస్ బిల్డింగ్ సొసైటీలో సభ్యత్వ నమోదు ప్రారంభించినట్లు జిల్లా అధ్యక్షులు అఫ్జల్‌హసన్ తెలిపారు. టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో గురువారం సభ్యత్వ నమోదును ఆయన జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్.సాగర్, హౌసింగ్ సొసైటీ చీఫ్ ప్రమోటర్ నీరుకొండ చంద్రశేఖర్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం అఫ్జల్ హసన్ మాట్లాడుతూ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మామిళ్ల రాజేందర్, మారం జగదీష్ సహకారంతో మిగిలిన ఉద్యోగులందరికీ ప్లాట్లు కేటాయించేలా కార్యాచరణ ఉంటుందని తెలిపారు. టీఎన్జీవోస్ బాధ్యులు నందగిరి శ్రీను, ప్రసాదరావు, చుంచు వీరనారాయణ, మజీద్, పవన్, శాబాసు జ్యోతి, నాగుల్‌మీరా, వెంకటరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ఖమ్మంరూరల్/నేలకొండపల్లి: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మండలంలో గురువారం పర్యటించిన ఆయన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం బీఆర్ఎస్ కార్యకర్తలతో మాట్లాడుతూ కేసీఆర్ మూడో సారి సీఎం అయ్యేలా అందరూ కృషి చేయాలన్నారు. అందరి ఆకాంక్ష మేరకు బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ ప్రచారం చేయాలని సూచించారు. అలాగే, ఖమ్మం రూరల్ మండలం మత్తుగూడెంలో పలువురి కుటుంబాలను తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. ఈకార్యక్రమాల్లో నాయకులు సాధు రమేష్‌రెడ్డి, మద్ది మల్లారెడ్డి, శాఖమూరి రమేష్, జూకూరి గోపాలరావు, వెన్నపూసల సీతారాములు, వేగినాటి లక్ష్మీనర్సయ్య, కాసాని నాగేశ్వరరావు, కొమ్మూరి నరేష్, మైసా శంకర్, మస్తాన్, జొన్నలగడ్డ రవి, జగదీష్, కడియాల నరేష్, బండి జగదీష్, తేజావత్ పంతులు, తోట వీరభద్రం, జంగం భాస్కర్ పాల్గొన్నారు.

'మోదీ పాలనలో దిగజారిన దేశ ప్రతిష్ట'



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మం రూరల్: దేశంలో నరేంద్రమోదీ పాలనలో దేశ ప్రతిష్ట దిగజారిపోయిందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డులో గురువారం తమ్మినేని సుబ్బయ్య స్మారక భవనంలో నిర్వహించిన పార్టీ రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. బీజేపీ పాలనలో ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోగా, 140 కోట్ల మంది ప్రజల సంపదను కార్పొరేట్లకు దారాధత్తం చేశారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కార్యకర్తలు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. పార్టీ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు బుగ్గవీటి సరళ, బండి రమేష్, మోహన్‌రావు, సుదర్శన్‌రెడ్డి, సంఘయ్య, యామిని, నర్సింహారావు, రామయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆటో, ముగ్గురికి గాయాలు

కొణిజర్ల: కట్టెల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనక నుంచి ఆటో ఢీకొట్టిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. మండంలోని సింగరాయపాలెంకు చెందిన చిరంజీవి తన ఆటోలో ఖమ్మం నుంచి ఇద్దరిని తీసుకుని వైరా వస్తుండగా పల్లిపాడు వద్ద కట్టెల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆటో ముందు భాగం దెబ్బతిని చిరంజీవి గాయపడ్డాడు. అలాగే, ఆటోలో ప్రయాణిస్తున్న ఖమ్మం టేకులపల్లికి చెందిన రాములమ్మ, వెంకమ్మకు సైతం స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108లో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పాఠాలు చెప్పేదెవరు?

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత

- బడులు ప్రారంభమై మూడు వారాలు గడిచినా అదే పరిస్థితి
- గత అనుభవాల నుంచి గుణపాఠం నేర్వని అధికారులు



సత్తుపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులు సౌకర్యాలు కల్పించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇదంతా బాగానే ఉన్నా ఉపాధ్యాయుల నియామకంలో మాత్రం అడుగు పడడం లేదు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడగా.. ఈ ఏడాది సౌకర్యాలు మెరుగుపడ్డాయి. కానీ ఉపాధ్యాయులు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో బోధన చురుగ్గా సాగడం లేదని తెలుస్తోంది. విద్యాసంవత్సరం మొదలయ్యే నాటికి ఉపాధ్యాయులను నియమించడమా లేదంటే విద్యావాలంటర్లను ఎంపిక చేయడం జరిగితే విద్యార్థులకు మేలు జరిగేది.

భారీగానే ఖాళీలు

జిల్లాలోని 21 మండలాల పరిధిలో 1216 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటన్నింట్లో 5,759మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించాల్సి ఉంది. కానీ 974పోస్టులు ఖాళీగా ఉండడం గమనార్హం. ఇందులో సబ్జెక్ట్ ఉపాధ్యాయులు 515మంది, ఎస్‌ఏలు 323మంది, ఇతర ఉపాధ్యాయులు 136మంది లేక బోధన కుంటుపడుతోంది. పాఠశాలల నిర్వహణలో కీలకమైన హెచ్‌ఎంలతో పాటు గణితం, బయాలజీ, సోషల్ బోధించే ఉపాధ్యాయులు లేకపోవడం విద్యార్థులను ఇబ్బందికి గురిచేస్తోంది.

చేదు అనుభవాలు ఉన్నా..

కీలకమైన సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు లేకపోవడంతో ఏటా సర్దుపాటు ప్రక్రియ చేపడుతున్నారు. గత ఏడాది మొదట్లో సర్దుబాటు చేయకుండా విద్యా సంవత్సరం సగంలో చేపట్టడంతో బోధన అంతంత మాత్రంగానే సాగింది. ఫలితంగా ఎస్సెస్సీలో మెరుగైన ఫలితాలు నమోదు కాలేదు. అయినప్పటికీ ఈసారి కూడా అధికారులు దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

కీలక సబ్జెక్టులకు టీచర్లే లేరు..

కీలక సబ్జెక్టులైన గణితం, సైన్స్, సోషల్, ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్న ప్రభుత్వం, అధికార యంత్రాంగం భర్తీ చేయటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గతంలో విద్యావలంటీర్ల ద్వారా కొద్దిలో కొద్దిగా బోధన సాగించగా.. వారిని సైతం మూడేళ్ల క్రితం తొలగించారు. ఆ తర్వాత కొత్త నియామకాలు చేపట్టకపోవటం, విద్యావలంటీర్ల రెన్యువల్ లేకపోవటంతో గతేడాది ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. ఈ ఏడాది అటు వీవీలను నియమించకపోగా, సర్దుబాటుపై కూడా దృష్టి సారించకపోవడం గమనార్హం.

జిల్లాలో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఇలా..

పోస్టులు	ఖాళీలు
గ్రేడ్–2 హెచ్‌ఎం	81
ఎస్‌ఏ సోషల్	166
ఎస్‌ఏ బయాలజీ	110
ఎస్‌ఏ మ్యాథ్స్	59
ఎస్‌ఏ తెలుగు	44
ఎస్‌ఏ ఇంగ్లీష్	26
ఎస్‌ఏ హిందీ	24
ఎస్‌ఏ ఫిజిక్స్	05
ఎస్‌జీటీలు	323
ఇతర ఉపాధ్యాయులు	136
మొత్తం	974

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి



పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాల్సిన అవసరముంది. పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించామని చెబుతున్నా వంద శాతం పనులు కాలేదు. మరోపక్క ఉపాధ్యాయులు లేనందున నియామకాలు చేపట్టి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి.

– వెంకటేష్, జిల్లా కార్యదర్శి, పీడీఎస్‌యూ

రెండు రోజుల్లో సర్దుబాటు



ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు సర్దుబాట్లు చేస్తున్నాం. రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది. కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూస్తాం.

– సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

గొల్లగూడెం ఈద్గాలో బక్రీద్ ప్రార్థనలు

ముస్లింలతో కలిసి పాల్గొన్న మంత్రి పువ్వాడ



ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 14వ డివిజన్ గొల్లగూడెంలోని ఈద్గాలో గురువారం బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. వివిధ ప్రాంతాల ముస్లింలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. మత పెద్ద ప్రార్థన చేయించిన అనంతరం బక్రీద్ విశిష్టతను వివరించారు. ఆతర్వాత ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈప్రార్థనల్లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కార్పొరేటర్ కూరాకుల వలరాజు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లడుతూ ప్రజలందరిపై అల్లా ఆశీస్సులు ఉండాలని.. రాష్ట్రం, జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ప్రార్థించినట్లు తెలిపారు. కాగా, ఏసీపీ గణేశ్, సీఐలు శ్రీహరి, శ్రీధర్ ఆధ్వర్యాన భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.

స్తంభాద్రి ఆలయంలో పూజలు



స్తంభాద్రి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి

ఖమ్మంగాంధీచౌక్: తొలి ఏకాదశి సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మంలోని స్తంభాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసిన ఆయన కేరళ తాత్వికులకు సాష్టాంగ నమస్కారం చేసి ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గోలి వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ బుడిగం శ్రీనుతో పాటు పొన్నం వెంకటేశ్వర్లు, వీరయ్య, చంద్రకాంత్, రోహిత్, చిన్ని, మధు తదితరులు పాల్గొన్నారు.

సీఎంగా కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో డీసీసీబీ చైర్మన్, ఎమ్మెల్యే



చెక్కులు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ నాగభూషణం, ఎమ్మెల్యే రాములునాయక్

ఖమ్మంమయూరిసెంటర్: ఎవరు ఎన్నిక కుట్రలు పన్నినా వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవడం, సీఎంగా కేసీఆర్ మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం పేర్కొన్నారు. బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు సిఫారసుతో వైరా, అశ్వారావుపేట, మధిర, పాలేరు, సత్తుపల్లి నియోజకవర్గాలకు చెందిన 57 మందికి మంజూరైన రూ.22,51,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం ఖమ్మంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో వారు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నామా ఎంపీగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే నామ ముత్తయ్య ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. రైతుబంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, వైరా జెడ్పీటీసీ నంబూరి కనకదుర్గతో పాటు నాయకులు బాణాల వెంకటేశ్వరరావు, చిరంజీవి, చేబ్రోలు మల్లికార్జునరావు, పోట్ల శ్రీనివాసరావు, చెరుకుమల్లి రవి, మాధవరావు, తన్నీరు రవికుమార్, బంధం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రామాలయంలో నేడు ముగ్గురు ఉద్యోగ విరమణ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ముఖ్య అర్చకులు అమరవాది చెన్నకృష్ణమాచార్యులు(రాజా), డోలు విద్వాంసులు మున్నంగి నాగేశ్వరరావు, నాదస్వర విద్వాంసులు షేక్ మౌలానా సాహెబ్ శుక్రవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఎన్నో సంవత్సరాలుగా వీరు స్వామివారికి జరిగే సేవల్లో పాల్గొంటూ భక్తుల మన్ననలు అందుకున్నారు. శ్రీరామనవమి, ముక్కోటి ఉత్సవాలతో పాటుగా అనేక వేడుకల్లో సేవలందించారు. వీరిని జూలై 1న ఘనంగా సత్కరించేందుకు అర్చకులు, ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. వీరితో పాటుగా ఉప ప్రధాన అర్చకులుగా పనిచేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఉప ప్రధానార్చకులు పొడిచేటి సత్యనారాయణాచార్యులు దంపతులను సైతం సత్కరించనున్నారు.

విద్వాంసుల నియామకం తప్పనిసరి..

కాగా సీతారామ చంద్రస్వామి ఆలయంలో నాదస్వరానికి ఇద్దరు, డోలుకు ఇద్దరు, తాళానికి ఇద్దరు ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో ఓ నాదస్వరం విద్వాంసుడు అవినీతి ఆరోపణలతో సస్పెన్షన్‌లో ఉన్నాడు. ఇప్పుడు ఇద్దరు విద్వాంసులు ఉద్యోగ విరమణ చేస్తే ముగ్గురు మాత్రమే ఉంటారు. ఇందులో నాదస్వర విద్వాంసులు ఒక్కరూ లేరు. వెంటనే శాశ్వత ప్రాతిపదికన లేదా డిప్యూడేషన్‌పై సదరు పోస్టులను భర్తీ చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఉద్యమగాయకుడు సాయిచంద్ మృతి తీరని లోటు

సంతాపం ప్రకటించిన మంత్రి పువ్వాడ, ప్రజాప్రతినిధులు



కన్నీటి పర్యంతమవుతున్న ఎమ్మెల్సీ మధు, పక్కన ఎమ్మెల్యే రాములునాయక్ తదితరులు



సాయిచంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

ఖమ్మం మయూరిసెంటర్/ ఖమ్మం వైరారోడ్: తెలంగాణ ఉద్యమంలో తన పాటలతో ఉర్రూతలూగించిన ఉద్యమగాయకుడు, రాష్ట్ర గిడ్డంకుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ మృతి తీరని లోటని పలువురు పేర్కొన్నారు. ఈమేరకు రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర తదితరులు సంతాపం ప్రకటించారు. అలాగే, ఖమ్మంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సాయిచంద్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ సాయిచంద్ తనకు సన్నిహితుడని గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణంతో పాటు కొండబాల కోటేశ్వరరావు, నల్లమల వెంకటేశ్వర్లు, కమర్తపు మురళి, చింతనిప్పు కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు. ఇంకా సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు కూడా సాయిచంద్ మృతిపై సంతాపం తెలిపారు.

సత్తుపల్లిలో నివాళి

సత్తుపల్లిటౌన్: తెలంగాణ ఉద్యమాన్ని తన పాట, మాటలతో పదునెక్కించిన సాయిచంద్ మృతిపై ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జానపద కళాకారులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సత్తుపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సాయిచంద్ చిత్రపటం వద్ద ఎమ్మెల్యే నివాళులర్పించి మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావుతో పాటు మట్టా ప్రసాద్, వనమా వాసు, వేములపల్లి మధు, గుండ్ర రఘు, అద్దంకి అనిల్, అంకమరాజు, శ్రీను, నర్సింహారావు పాల్గొన్నారు.

పాలేరులో కందాలే పోటీ చేస్తారు..

- నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌గా ఎంపీలు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మధు

కూసుమంచి: వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పాలేరు బరిలో ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డే ఉంటారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ వెల్లడించారు. కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోనే అత్యధిక ప్రజాబలం ఉన్న వ్యక్తిగా ఉపేందర్‌రెడ్డి పాలేరులో వచ్చే ఎన్నికల్లో పోటీలో ఉంటారని సీఎం కేసీఆర్ తనకు స్వయంగా చెప్పారని పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఆయన గెలవటం తథ్యమని అన్నారు. ఇప్పటికే అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసేందుకు గాను ఎంపీలను ఇన్‌చార్జ్‌లుగా సీఎం నియమించారని తెలిపారు. మధిరకు నామా నాగేశ్వరరావు, సత్తుపల్లికి బండి పార్థసారధిరెడ్డి, కొత్తగూడెంకు వద్దిరాజు రవిచంద్రను నియమించగా, పాలేరు త్వరలో ఇన్‌చార్జిని ప్రకటిస్తారని పేర్కొన్నారు. ఎలాంటి బేధాభిప్రాయాలు ఉన్నా పక్కన బెట్టి పాలేరులో కందాళ గెలుపునకు కృషిచేయాలని మధు కోరారు.

మావోయిస్టు కొరియర్ అరెస్ట్

- రూ.6.20 లక్షల నగదు స్వాధీనం
- కరెన్సీ మొత్తం రద్దయిన రూ.2 వేల నోట్లే..

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులకు సంబంధించిన రద్దయిన రూ.2 వేల నోట్లను బ్యాంకులో జమ చేసేందుకు తీసుకొస్తున్న వ్యక్తిని ఆవుపల్లి సమీపంలో పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మావోయిస్టు పార్టీ బాసగూడ ఎల్‌ఓఎస్ కమాండర్ శంకర్, సేంద్ర ఆర్‌పీసీ ప్రెసిడెంట్ హడ్మా కుహ్రామి ఆదేశాల మేరకు మహేష్ బాడ్సే అనే వ్యక్తి రద్దయిన రూ.2 వేల నోట్లను తీసుకొస్తున్నాడనే సమాచారం పోలీసులకు అందింది. దీంతో ఆవుపల్లి పోలీసులు, సీఆర్‌పీఎఫ్ 229 బెటాలియన్ పోలీసులు ఆవుపల్లి సమీపంలోని ప్రధాన రహదారిపై నిఘా పెట్టారు. ద్విచక్రవాహనంపై వస్తున్న మహేష్ బాడ్సేను అదుపులోకి తీసుకుని తనిఖీలు చేయగా రద్దయిన రూ.2 వేల నోట్లు కనిపించాయి. విచారణలో పూర్తి వివరాలు వెల్లడించాడు. మొత్తం రూ. 9 లక్షల నగదు ఇచ్చి మావోయిస్టులు పంపినట్లు, అందులో రూ.1.80 లక్షలు ఆవుపల్లిలోని ఐసీఐసీఐ బ్యాంకులో జమ చేసినట్లు వివరించాడు. రూ. లక్ష ఇతర అవసరాలకు వాడాలని, మిగిలిన రూ.6.20 లక్షలను మళ్లీ బ్యాంకులో జమ చేయాలని మావోయిస్టులు సూచించినట్లు మహేష్ తెలిపాడు. నిందితుడిని అరెస్ట్ చేసి బీజాపూర్ జిల్లా కోర్టులో రిమాండ్ చేసినట్లు అక్కడి పోలీసులు తెలిపారు.

నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో గురువారం తొలి ఏకాదశి, పెరియాళ్వార్ తిరునక్షత్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. ఆ తర్వాత ఆళ్వార్‌కు స్నపన తిరుమంజనం, తిరువీధి, చుట్టు సేవలను జరిపారు. తొలి ఏకాదశి కావడంతో భక్తులు స్వామివారి దర్శనానికి బారులుదీరారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి, అమ్మవార్లను బేడా మండపంలో వేంచేపు చేసి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, జూలై 3వ తేదీన దమ్మక్క సేవా యాత్ర, గోవిందరాజ స్వామి కల్యాణం నిర్వహణకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి గిరిజనులను ఆలయానికి తీసుకొచ్చేందుకు ఆర్టీసీ బస్సులను సిద్ధం చేస్తున్నారు.

పోక్సో కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: మైనర్ బాలికను తల్లిని చేసి వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై పోలీసులు గురువారం పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్సై రాజేష్ కుమార్ కథనం ప్రకారం.. అశ్వారావుపేటలోని ఓ కాలనీకి చెందిన పదహారేళ్ల బాలికకు దమ్మపేట మండలం గట్టుగూడెం గ్రామానికి చెందిన వివాహితుడైన విజయసాయిరెడ్డి మాయమాటలు చెప్పి రెండేళ్లుగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. దీంతో బాలిక గర్భం దాల్చి ఏడాది క్రితం బాబుకు జన్మనిచ్చింది. కాగా కొంతకాలం నుంచి బాలికను విజయసాయిరెడ్డి వేధింపులకు గురిచేస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి వేధించడంతో భరించలేని ఆమె అర్ధరాత్రి సమయంలోనే పోలీసులను ఆశ్రయించింది. కాగా ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బాధిత తల్లి బిడ్డలను సంరక్షణ కోసం కొత్తగూడెంలోని శిశుసంరక్షణ కేంద్రానికి తరలించినట్లు పేర్కొన్నారు.

వర్షపాతం ఆధారంగానే పత్తి సాగు

- 60 మి.మీ.ల వర్షపాతం ఉంటే వంద శాతం మొలక
- వచ్చేనెల 20వరకు సాగుకు అవకాశం



విత్తనాలు నాటేందుకు అచ్చు తోలుతున్న రైతు



తిరుమలాయపాలెం మండలంలో పత్తి గింజలు నాటుతున్న కూలీలు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో సాగయ్యే ప్రధాన పంటల్లో పత్తి ఒకటి. వాణిజ్య పంటల్లో ముఖ్యమైన ఈ పంటను జిల్లాలో గత ఏడాది 2.21 లక్షల ఎకరాల్లో సాగు చేయగా, ఈ ఏడాది కూడా అదే స్థాయిలో సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. అయితే, గత ఏడాది వర్షాలు అనుకూలించడంతో జూన్ ఆరంభం నాటికి పత్తి విత్తనాలు నాటగా, ఈసారి అలా జరగలేదు. మార్చి, ఏప్రిల్‌ల్లో కురిసిన అకాల వర్షాలతో దుక్కులు దున్నిన రైతులు వర్షం ఎదురుచూస్తున్నారు. కొన్నిచోట్ల నల్లరేగడి నేలల్లో పొడి దుక్కుల్లోనే పత్తి విత్తనాలు నాటినట్లు తెలిసింది. ఇలా సుమారు 60 వేల ఎకరాల్లో పత్తి విత్తనాలను నాటినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కానీ సమయానికి వర్షాలు కురవక ఆ విత్తనాలు మొలకెత్తలేదు. ఈమేరకు పత్తి రైతులకు వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ జె.హేమంత్‌కుమార్ ఇచ్చిన సూచనలు ఇలా ఉన్నాయి.

రైతులకు సూచనలు....

- వర్షపాతం ఆధారంగా వచ్చేనెల 20వ తేదీ వరకు పత్తి విత్తనాలు విత్తుకోవచ్చు.
- ఒకటి, రెండు తేలికపాటి వర్షాలు పడగానే తొందరపడొద్దు. కనీసం 60 మి.మీ.ల వర్షం కురిశాకే పత్తి గింజలునాటితే వంద శాతం మొలక వస్తుంది.
- రైతులు తమ ప్రాంతానికి అనువైన బీటీ విత్తనాలను అనుభవం మీద ఎంచుకోవాలి. ఇవి కూడా ఒకటే రకం కాకుండా రెండు నుండి మూడు రకాలు ఎంచుకుంటే మంచిది.
- వర్షాధారంగా సాగు చేస్తే త్వరగా పూతకొచ్చే రకాలు, నీటి వసతి ఆధారంగానైతే మధ్యస్థంగా, ఆలస్యంగా పూత, కాతకు వచ్చే రకాలను ఎంపిక చేసుకోవాలి.
- బీటీ విత్తనాలు ఎంపిక చేసుకునే రైతులు మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలి. 40 లేదా 42 అంగుళాల అచ్చుకు బదులుగా 3–2 అడుగులు లేదా 4–2 అడుగుల అచ్చులు నేల స్వభావాన్ని దృష్టిలో ఉంచుకొని విత్తితే మంచి దిగుబడి సాధించవచ్చు.
- తేలిక నేలల్లోనైతే అధిక సాంద్రత పద్ధతిలో పత్తిని 10–5 సెం.మీ దూరంలో విత్తుకోవాలి. అధిక సాంద్రత పద్ధతికి అనువైన వంగడాలను ఎంచుకుంటే మంచి దిగుబడి రావడమే కాక రెండో పంట కూడా సకాలంలో విత్తుకోవచ్చు.
- పత్తి గింజలు విత్తిన 48 గంటల్లో తేమ ఉన్నప్పుడు పెండిమిథాలిన్ 1.2 గ్రాములను ఎకరాకు పిచికారీ చేస్తే కలుపు ఉధృతి తగ్గుతుంది.
- వాతావరణ శాఖ జారీ చేసే ముందస్తు వాతావరణ సూచనలను తెలుసుకుంటే పత్తి విత్తనాలు నాటుకోవాలి.